వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పోలీసుల పిల్లలకు హెల్మెట్లను పంపిణీ చేస్తున్న అదనపు సీపీ విశ్వ ప్రసాద్

చాంద్రాయణగుట్ట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్ అదనపు సీపీ పి.విశ్వ ప్రసాద్ అన్నారు. రైడ్ టు సేఫ్టీ క్యాంపెయినింగ్‌లో భాగంగా చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఓ.ఎస్.ఫంక్షన్ హాల్‌లో బుధవారం పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు రోడ్డు సేఫ్టీ ఎన్జీవో ట్రాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన 240 హెల్మెట్‌లను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారితో పాటు రాంగ్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. అంతకు ముందు మొఘల్ కళాశాల వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలలో ఆయన స్వయంగా పాల్గొని నిబంధనలను అతిక్రమించిన 60 మందికి చలానాలు విధించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-3 డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ వి.చంద్ర కుమార్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ జె.శ్రీను నాయక్, ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్ట్ హెడ్ ఆరాధన జైన్, పీవో రాజేష్ నీమ్‌కార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏవీ రాజశేఖర్



రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపక బృందం

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ఏవీ రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిజాం కళాశాల టీచర్స్ అసోసియేషన్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో అధ్యాపకుల సమస్యలను త్వరలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ఎస్‌పీ రత్నం, జీవన్, వెంకటేశ్వర్‌రావు, ఎ.జానకిరెడ్డి, బి.సుదర్శన్, డాక్టర్ వీరు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

జియాగూడ: కాంగ్రెస్ పార్టీ పటిష్టతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందేవిధంగా కృషి చేయాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, చండీఘడ్ రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ ఎస్‌ఏ.సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాహుల్ కుమార్, జియాగూడ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్‌కుమార్, సహా కార్యదర్శి, పబ్లిక్ సోషల్ వర్కర్ మహేశ్ బాబు, గౌతమ్, నరేష్ సన్మానించి అభినందించారు.



సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో ఏఎంఎస్ (యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టమ్)ను రద్దు చేయాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, వాటర్‌బోర్డు కాంట్రాక్టర్స్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఏఎంఎస్ రెండేళ్ల టెండర్ విధానం పూర్తిగా అవినీతిమయమైందన్నారు. ఈమేరకు గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..గత కొన్ని సంవత్సరాలుగా ఏఎంఎస్ విధానంతో కోట్లాది రూపాయల అవినీతి వాటర్‌బోర్డులో జరిగిందన్నారు. ఏసీబీ, విజిలెన్స్ అధికారులు ఈ అవినీతిపై విచారణ జరిపి సంబంధిత ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షల వ్యయంతో ఏఎంఎస్ రెండేళ్ల టెండర్లు ఇచ్చారన్నారు. తాము అయితే రూ.25 లక్షలకే ఆ పనులు చేస్తామని పోల్కం శ్రీనివాస్ వివరించారు. సానుకూలంగా స్పందించిన మహేష్కర్ కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క ఏఎంఎస్ విధానంపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు వారసత్వ కట్టడాల గురించి తెలియజేయాలి

గోల్కొండ: విద్యార్థులకు మన దేశ వారసత్వ కట్టడాల గురించి తెలియజేయాలని గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి ఎం.నవీన్‌కుమార్ అన్నారు. వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా గోల్కొండ కోటలో ఏర్పాటు చేసిన వారసత్వ కట్టడాల ఛాయాచిత్రాల ప్రదర్శనలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలోని చారిత్రక కట్టడాల పరిరక్షణలో కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ ఎంతో కృషి చేస్తుందన్నారు. గోల్కొండ కోట సుమారు 500 ఏళ్ల క్రితం కట్టబడిందని అయితే దీని పరిరక్షణ కోసం సాంకేతిక సిబ్బందితో పాటు పరిరక్షణ సిబ్బంది సైతం ప్రతినిత్యం కృషి చేస్తుందన్నారు. ఛాయాచిత్ర ప్రదర్శనను వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు గోల్కొండ ఉర్దూ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించారు.



గోల్కొండ కోటలో వారసత్వ కట్టడాల ఛాయాచిత్రాలను చూస్తున్న విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాజ్ నారాయణ ముదిరాజును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చార్మినార్: పత్తర్‌ఘట్టిలోని నానక్ రామ్ భగవాన్ దాస్ సైన్స్ కాలేజీలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1983 బ్యాచ్‌కు చెందిన అప్పటి విద్యార్థులు 41 ఏళ్ల తర్వాత కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇటీవల అమెరికా నుంచి యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ ద్వారా అవార్డు పొంది సన్మానించబడిన సందర్భాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థి, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్‌ను సన్మానించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రాం ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ మెంబర్ సీతారామ రాజు, ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కేపీ హేమంత్ కుమార్, ప్రముఖ విద్యావేత్త అజయ్ సింగ్ ఠాకూర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాస్, రోడ్డు రవాణా సంస్థ అధికారి రమేష్, ప్రముఖ జియాలజిస్ట్ మధుసూదన్ రెడ్డి, వ్యాపారవేత్తలు వి.రవీంద్ర కుమార్, విక్రమ్ మల్ హోత్ర, పీవీ ప్రేమ్ రాజ్, జగదీశ్వర్, నగర పాలక సంస్థ ప్రముఖ ఇంజినీర్ మొహమ్మద్ నూరి తదితరులు పాల్గొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

యాకుత్‌పురా: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. లబ్ధిదారులకు మంజూరైన 178 షాదీ ముబారక్ చెక్కులను చార్మినార్ మండల కార్యాలయంలో బుధవారం ఆయన కార్పొరేటర్లు, తహసీల్దార్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ..ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో బాసట ఉంటాయన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, అలందార్ వాలాజాహి, చార్మినార్ తహసీల్దార్ నిహారిక, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

గ్రంథాలయాలు జ్ఞాన దేవాలయాలు

చార్మినార్: గ్రంథాలయాలు జ్ఞాన దేవాలయాలని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవం ముగింపు సందర్భంగా బుధవారం గ్రంథాలయ విభాగం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే ప్రధానమైన గ్రంథాలయాలలో సిటీ కాలేజీ గ్రంథాలయం ఒకటని, తమ విద్యార్థులే కాక, పరిశోధక విద్యార్థులు కూడా రిఫరెన్స్ పుస్తకాల కోసం వస్తుంటారన్నారు. గ్రంథాలయ అధికారి వారం రోజులపాటు నూతన పుస్తకాలతో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తిలకించి వారి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థి కేంద్రంగా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దటమే కాక, వారికి నిత్యం విద్యా, ఉద్యోగ సమాచారం అందిస్తున్న లైబ్రేరియన్ డా.చేగోని రవికుమార్ను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, సీనియర్ అధ్యాపకులు డా.యాదయ్య, డా.నీరజ, కె.శ్రీకాంత్ రెడ్డి, సహాయ గ్రంథపాలకురాలు తబుస్సుం ఫాతిమా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్

రక్తదాన శిబిరం..

ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఉస్మానియా ఆసుపత్రితో కలిసి బుధవారం సిటీ కాలేజీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ నిత్యం ఎందరినో ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుతున్నారన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ అధికారి డా.కృష్ణ వేణిని, ఎన్.సి.సి కాడెట్లను అభినందించారు. 43 యూనిట్ల రక్తం సేకరించామని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

నియామకం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగారం భాస్కరా చారి నియమితులర్యారు. ఈ మేరకు బుధవారం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరాచారి మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వ బ్రాహ్మణల, విశ్వకర్మల ఐక్యత, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి, కోశాధికారి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: కార్తీక మాసం మూడవ బుధవారం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రిసాలబజార్ హనుమాన్, శివాలయం ఆలయంలో గోల్కొండ టెంపుల్ అడ్వైజరీ కమిటీ సలహాదారు బి.సాయిబాబాచారి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గోల్కొండ కోట మహంకాళి అమ్మవారి ఆలయ పూజారి సురేష్‌చారి, బీజేపీ నాయకుడు బి.శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



డాక్టర్ ఖాదర్‌వలీని సన్మానిస్తున్న కిన్నెర రాధాకృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. ఈ మేరకు బుధవారం మై హోమ్ అవతార్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరి ధాన్యాలు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిన్నెర రాధాకృష్ణ, డాక్టర్ పి.వి జయ్‌కుమార్‌లు ఆయనను ఘనంగా సన్మానించారు.

ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి అన్నారు. బుధవారం సూర్యలోగ్ కాంప్లెక్స్‌లో మాతృదేవోభవ సత్సంగ్ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేణుగోపాలచారి మాట్లాడుతూ..భారతదేశంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణం, వ్యవసాయరంగ అభివృద్ధి వంటి అనేక విషయాలలో ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు సాహోసోపేతమైనవని కొనియాడారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీజీపీ గోపీనాథ్‌రెడ్డి, సంస్థ వ్యవస్థాపకులు కేబీ.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.ఉదయలక్ష్మి, సూర్యప్రకాష్‌రావు, ఆదిలీల ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆదినారాయణ, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న వీసీ కుమార్

అఫ్జల్‌గంజ్: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువత, విద్యార్థులు సెల్‌ఫోన్లకే పరిమితమై తమ విలువైన జీవితాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. ఇదే సమయాన్ని పుస్తక పఠనానికి వెచ్చించినట్లయితే విజ్ఞానవంతులుగా సమాజానికి ఎంతో ఉపయోగపడతారన్నారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలను ఆధునీకరించి అత్యాధునిక సౌకర్యాలను కల్పించేందుకుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పౌర గ్రంథాలయ ఉప సంచాలకులు హరిశంకర్, సహాయ సంచాలకులు నరసింహులు, ముఖ్య గ్రంథ పాలకురాలు పీజీపీ రాణి, గెజిటెడ్ గ్రంథ పాలకులు సి.అపర్ణ, గ్రంథాలయ ఉద్యోగులు కేసరి హనుమాన్, రాజేష్, రవి, ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

గోల్కొండ: గోల్కొండ కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె బల్దియా అధికారులతో కలిసి గోల్కొండ కోట చౌరస్తా, బస్టాప్, రాందేవ్‌గూడ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం చౌరస్తా మధ్య ఉన్న విద్యుత్ స్తంభం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుందని దానిని చౌరస్తా మధ్యలో ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. మరోవైపు సిగ్నల్స్ కూడా ఏర్పాటు చేయడానికి ఈ ప్రాంతంలో ఎంతో అవసరమని దీనికి అవసరమైన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. చౌరస్తా చుట్టూ ఉన్న షాపుల ముందు వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలని ఆమె ట్రాఫిక్ పోలీసులు సూచించారు. కటోరా హౌస్ నుంచి చౌరస్తా వరకు, చౌరస్తా నుంచి ఫతేదర్వాజా వరకు అక్రమ పార్కింగ్‌లను నివారిస్తే ట్రాఫిక్ సాఫీగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. ట్రాఫిక్ ఎస్సై ప్రేమ్‌రాజ్ తదితరులున్నారు.



గోల్కొండ చౌరస్తా వద్ద పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

అఫ్జల్‌గంజ్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అధికారులను కోరారు. బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాటర్‌బోర్డు జీఎం జాన్ షరీఫ్ వెంటనే ఫిష్ మార్కెట్ వద్ద ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. ఎప్పటికప్పుడు వాటర్‌బోర్డు జీహెచ్ఎంసీ అధికారులు సమస్యలు పరిష్కరిస్తే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. కొన్ని నెలలుగా ఫిష్ మార్కెట్ వద్ద డ్రైనేజీ సమస్య ఉన్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. బేగంబజార్ ఫిష్ మార్కెట్ పరిసరాల్లో రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు వేగవంతంగా పనులు చేయనిచో కమిషనర్ ఇలంబర్తిని కలిసి తెలియజేస్తానని ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపారు. జాంబాగ్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు అహ్మద్, రాజ్‌కుమార్ సింగ్, మున్న భాటి, రాము, సుదర్శన్, ప్రేమ్ ఠాకూర్, ఆకాష్, స్వామి ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.



బేగంబజార్ ఫిష్ మార్కెట్ వద్ద సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

క్రీడలతో మానసికోల్లాసం

విజయనగర్‌కాలనీ: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని నారాయణ విద్యా సంస్థల తెలంగాణ జీఎం గోపాల్‌రెడ్డి అన్నారు. విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం నగరంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడల్లో ఆయన పాల్గొన్నారు. సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ క్రీడలను ప్రారంభించారు. ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో తమకు ఇష్టమైన ఆటలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు నైపుణ్యవంతులైన శిక్షణాధికారులతో తర్ఫీదును ఇప్పించాలన్నారు. ఈ క్రీడాపోటీల్లో మెహిదీపట్నం జోన్ నారాయణ ఒలింపియాడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ సత్తాచాటారు. ఆర్ఐ నవీన్‌కుమార్, విజయనగర్ కాలనీ నారాయణ ఈటెక్నో పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన ముబీన్, కో ఆర్డినేటర్స్ చంద్రశేఖర్, రష్మిక, అకౌంట్ ఆఫీసర్ లావణ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో విజయనగర్ కాలనీ నారాయణ పాఠశాల విద్యార్థులు

ఆకట్టుకున్న సంప్రదాయ కళల ఉత్సవం



కళాకారులను సన్మానిస్తున్న బీపీ ఆచార్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ 47వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రదాయ కళల ఉత్సవం పేరిట నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో రెండో రోజు అయిన బుధవారం ప్రదర్శించిన సంప్రదాయ కళలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిందు యక్షగానం, సీతాకల్యాణం బుర్రకథ, భక్త ప్రహ్లాద కూచిపూడి యక్షగానం ఎంతగానో అలరించాయి. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి బీపీ.ఆచార్య, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఇన్‌కమ్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్ పి.రఘు, కిన్న కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా చార్మినార్ సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. బీబీబజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మేతర్‌వాడి విద్యుత్ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌షాహీ, మేథర్ వాడి, గౌలిపురా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధాహ్నం 12 గంటల వరకు. షాజహాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని షాజహాన్ హోటల్, తలాబ్‌కట్ట, సుల్తాన్‌షాహీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. డార్జింగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని క్యుబా మసీద్, షాజహాన్, తలాబ్‌కట్ట, గౌలిపురా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

దుప్పట్లు, ఆహారం పంపిణీ



గోల్కొండ: అనాథ పిల్లలను దుప్పట్లు, ఆహారం అందిస్తున్నామని మామిడి వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మామిడి అరవింద్ అన్నారు. మామిడి వెంకటమ్మ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఆయన షేక్‌పేట్, టోలిచౌకీ, జూబ్లిహిల్స్ తదితర ప్రాంతాల్లోని అనాథ పిల్లలకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎందరో అనాథ పిల్లలు ఏ ఆసరా లేక ఫుట్‌పాత్‌లు, ప్లై ఓవర్ల కింద జీవనం వెల్లదీస్తున్నారన్నారు. అలాగే బసవతారకం, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి వద్ద పేద రోగులకు దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. హేమంత్, జగదీష్ తదితరులున్నారు.

టోలిచౌకీలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



గోల్కొండ: ఫుట్‌పాత్ ఆక్రమణలను సహించేది లేదని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు టోలిచౌకీ టూంబ్స్ రోడ్డు, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లను కబ్జా చేసి వాటిపై వెలిసిన డబ్బాలను తొలగించి వాటిని గోషామహల్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు గురి చేసిన వారితో మాట్లాడారు. ప్రస్తుతం డబ్బాలను తొలగిస్తున్నామని మళ్లీ ఫుట్‌పాత్‌లను కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

గంజాయి తాగుతున్న వ్యక్తికి జైలు



సయ్యద్ రషీద్

గౌలిపురా: గంజాయి తాగుతున్న ఓ వ్యక్తికి నెల రోజుల పాటు జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాల స్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్ కట్టా ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సయ్యద్ రషీద్ (30) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో రషీద్‌పై కేసు నమోదు చేసుకొని బుధవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా పూర్వాపరాలను పరిశీలించిన స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతిరావు నిందితుడికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వెంకట నర్సింహారావుకు సాంబాదిక గౌరవ్ సమ్మాన్ అవార్డు



అబిడ్స్: నేషనల్ ప్రెస్ డేను పురస్కరించుకొని ఆదర్శ రత్న సంపాదకులు పాటి వెంకట నర్సింహారావుకు రాష్ట్రీయ సాంబాదిక గౌరవ్ సమ్మాన్-2024 అవార్డును అందజేశారు. ఒడిశాలో జరిగిన నేషనల్ ప్రెస్ డే వేడుకల్లో ఆ రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ ఆయనకు అవార్డు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట నరసింహారావు మాట్లాడుతూ..ప్రస్తుత డిజిటలైజేషన్ యుగంలో జర్నలిస్టు వృత్తి డిజిటలైడ్‌గా మారిందన్నారు. పాత్రికేయ రంగం ఎంతో విలువైందని సమాజంలో, సమాజ ఉన్నతికి పాత్రికేయ రంగం దోహదపడుతుందన్నారు. తనకు జాతీయ అవార్డు లభించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

ఫుట్‌బాల్ టీమ్ కోచ్‌గా మహ్మద్ అబ్దుల్ ఖదీర్



గన్‌ఫౌండ్రీ: ఇండియన్ ఫుట్‌బాల్ స్కేటింగ్ టీమ్ కోచ్‌గా మహ్మద్ అబ్దుల్ ఖదీర్ నియమితులయ్యారు. ఈ నెల 21వ తేదీ నుంచి టర్కీలో జరుగనున్న పోటీలకు ఈయన కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన క్రీడాకారులతో కలిసి టర్కీకి బయల్దేరి వెళ్లారు. ఈ పోటీల్లో భారతజట్టు మెరుగైన ప్రతిభను కనబరుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మోదీ పథకాలతో బీజేపీకి ఆదరణ



జియాగూడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంక్షేమ పథకాలు, అభివృద్ధితోనే బీజేపీకి ఆదరణ వస్తోందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన ఆలా పురుషోత్తమ్‌రావు బుధవారం రాజాసింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలా పురుషోత్తమ్‌రావు బీజేపీలో చేరడంతో పార్టీకి ఎంతో బలం చేకూరుతుందన్నారు. పురుషోత్తమ్‌రావు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సేవ చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలను ఇంటింటా చేర వేసేందుకు కృషి చేస్తానన్నారు.